

నేటి ప్రజావాణి రద్దు

మేడ్చల్ ప్రతినిధి/వికారాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్షల నిర్వహణలో భాగంగా వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్లలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా ఈనెల 18న జరగనున్న ప్రజావాణిని రద్దుచేసినట్లు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, గౌతమ్‌లు తెలిపారు. జిల్లాల అధికారులందరూ గ్రూప్-3 పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నందున నేటి ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

తొలిరోజు ప్రశాంతం

సజావుగా సాగిన గ్రూప్-3 పరీక్ష

- వికారాబాద్ జిల్లాలో పేపర్-1కు 58.91 శాతం, పేపర్-2కు 55.04 శాతం..
- మేడ్చల్‌లో 30 శాతమే హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్..
- పటిష్టమైన పోలీసు బందోబస్తు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు ప్రతీక్‌జైన్, గౌతమ్
- ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన 65 మంది అభ్యర్థులు



పరిగిలోని పరీక్ష కేంద్రం బయట ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష ఆదివారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసింది. వికారాబాద్ జిల్లాలో ఉదయం, మధ్యాహ్నం జరిగిన పేపర్-1, 2 పరీక్షలకు పలువురు అభ్యర్థులు ఒకటి నుంచి అయిదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. ఉదయం 9.30 గంటలు, మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులను అధికారులు లోపలికి అనుమతించలేదు. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 61 మంది అభ్యర్థులు ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసే అవకాశం కోల్పోగా, మధ్యాహ్నం నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, పూడూరు పరిధిలో 31 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 10,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాలి. కాగా, ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 5,987 మంది హాజరుకాగా, 4,209 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పేపర్-2 పరీక్షకు 5,612 మంది హాజరు కాగా, 4,584 మంది గైర్హాజరయ్యారు. పేపర్-1 పరీక్షకు 55.04 శాతం అభ్యర్థులు హాజరు కాగా, పేపర్-2 పరీక్షకు 55.04 శాతం మాత్రమే హాజరయ్యారు. పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడమే కాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు తమ పరిధిలోని పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.



కూకట్‌పల్లిలోని ఓ సెంటర్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఆలస్యంగా వచ్చి...

వికారాబాద్ జిల్లాలో ఈ రెండు పేపర్ల పరీక్షలకు ఆలస్యంగా వచ్చి 65 మంది అభ్యర్థులు పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. నిర్దేశించిన

మిగతా 8వ పేజీలో...

రేపటి నుంచి ప్రజా విజయోత్సవాలు

- జిల్లాలో పర్యటించనున్న కళాయాత్ర బృందం
- ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన: కలెక్టర్ ప్రతీక్‌జైన్



కొడంగల్/వికారాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజాపాలన యేడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన కళాయాత్రను ఈనెల 19 నుంచి డిసెంబరు 7వరకు చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారథి కళాకారులతో గ్రామాల్లో తిరుగుతూ ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కాగా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కళాయాత్ర బృందం ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, అంతడపుల నాగరాజు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తారని తెలిపారు. ఈ బృందాలు కొడంగల్‌లోని రాఘవేంద్ర గార్డెన్‌లో ఈనెల 18న సోమవారం సాయంత్రం 6గంటలకు ప్రొఫెసర్ అలేఖ్య పుంజల బృందంతో ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

రేపు కౌన్సెలింగ్ : డీఎంహెచ్‌వో రఘునాథస్వామి


మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డీఎంహెచ్‌వో రఘునాథస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించనున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యా సర్టిఫికెట్లు, స్థానికతకు సంబంధించిన ధృవపత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఎవరైనా వ్యక్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అధికారులమని చెప్పి ఫోన్ చేస్తే అభ్యర్థులు వెంటనే తెలంగాణ అవినీతి నిరోధక శాఖకు వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబరు 9440446106, టోల్ ఫ్రీ నంబరు 1064 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

22న దివ్యాంగులకు క్రీడా పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లాలో జూనియర్ విభాగం(10 నుంచి 17 ఏళ్లు), సీనియర్ (18 నుంచి54 ఏళ్లు) విభాగాల్లో దివ్యాంగులకు ఈనెల 22న ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత ఆదివారం తెలిపారు. రామకృష్ణపురం ఫుట్‌బాల్ గ్రౌండ్, నేరేడ్‌మెట్ క్రాస్ రోడ్డులో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు ఈనెల 21న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలలోగా పైన పేర్కొన్న ప్రదేశంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందులో చెస్, ట్రై సైకిల్, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు కూడా ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం!

కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు నిల్



కేంద్రాల్లోని ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలు

- వెబ్‌సైట్‌లో కనిపించని ట్యాగింగ్ కేంద్రాల పేర్లు
- అప్‌డేట్ కాని సాఫ్ట్‌వేర్‌తో పెరిగిన సమస్యలు
- కేంద్రాల చుట్టూ తిరిగినా దొరకని గన్నీ బ్యాగులు
- రైతులకు వసతులు కరువు
- బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయాలు.. దక్కని మద్దతు

6



వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో అధికారుల తీరు ఆరంభశూరత్వంగానే కనిపిస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. తొలిదశ పంట ఇప్పటికే చేతికి వచ్చినప్పటికీ కొనుగోళ్లు జరుగకపోవడంతో రైతులు ధాన్యాన్ని బయటి మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. అయితే ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా పలుకుతుండడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

పరిగి,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 126 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. 10.50 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. స్వయంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధికారులే అన్ని కేంద్రాలను ప్రారంభించారు. కానీ కొనుగోళ్లు మాత్రం జరుగడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల్లో సాంకేతిక సమస్యలతో నిర్వాహకులు సతమతవుతున్నారు. కేంద్రాల్లోని ట్యాబ్‌లో సాంకేతిక సమస్యలు కూడా ఇబ్బందిగా మారాయని చెబుతున్నారు. కొనుగోళ్లకు సంబంధించిన వెబ్‌సైట్‌లో కేంద్రాల పేర్లు కూడా ట్యాగింగ్ కావడం

మిగతా 8వ పేజీలో...

సాంకేతిక సమస్యే కారణం

జిల్లాలో 126 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. సాంకేతిక కారణాల వల్ల ఇంకా కొనుగోళ్లు పెద్దగా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పటికే జిల్లాలో రెండు, మూడు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇక అన్ని కేంద్రాల్లో ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కేంద్రాల్లో సమస్యలు లేకుండా కొనుగోళ్లు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

-విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లయ్, వికారాబాద్ జిల్లా

జిల్లాలో నేడు

లగచర్లలో బీజేపీ ఎంపీల పర్యటన

బొంరాస్‌పేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీలు డీకే. అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ సోమవారం లగచర్లలో పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు ఆదివారం తెలిపారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన వారితో సోమవారం ఉదయం సంగారెడ్డిలో ములాఖత్ అనంతరం మధ్యాహ్నం 3గంటలకు లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భూములు కోల్పోతున్న రైతులు, అరెస్టయిన రైతుల కుటుంబాలు పరామర్శించనున్నారు.

రైస్ కుక్కర్ పేలి వృద్ధుడి మృతి

వికారాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ రైస్ కుక్కర్‌లో అన్నం వండుతుండగా అది పేలడంతో పాటు విద్యుత్‌షాక్ తగిలి ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణంలోని గాంధీ కాలనీలో నివాసముంటున్న కొల్లూరు సోమేష్ (82)కు ముగ్గురు కూతుళ్లు. వారికి వివాహాలు జరగగా, రెండు సంవత్సరాల క్రితం అతని భార్య కళావతి మృతి చెందింది. ఆమె చనిపోవడంతో సోమేష్ ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం రాత్రి 8.30గంటలకు అన్నం వండుకునేందుకు రైస్ కుక్కర్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో కుక్కర్ పేలడంతో పాటు సోమేష్‌కు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, వారి కూతుళ్లకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



అనంతగిరి ఆలయంలో భక్తులు

భక్తుల కోలాహలం

- కీసరగుట్టలో అభిషేకాలు
- వన భోజనాలతో సండే సందడి
- చీర్యాల్‌లో కనుల పండువగా సత్యనారాయణ స్వామి వ్రతాలు
- అనంతగిరి జాతరకు భక్తుల రద్దీ

కీసర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో భక్తుల కోలాహలం నెలకొంది. కార్తీక మాసోత్సవంలో భాగంగా ఆదివారం కీసరగుట్టకు భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి, శివలింగాలకు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేశారు. కుటుంబ సభ్యులతో పాటు కమ్మ, కాపు, ఇతర కుల, కాలనీ సంఘాల ఆధ్వర్యంలో వన భోజనాలు ఆచరించి ఆనందంతో సండే సందడి చేశారు. కాగా సంకల్ప సిద్ధిగా పేరుగాంచిన శ్రీ చీర్యాల్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కనుల పండువగా సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. ఈ మేరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం వ్రతాలు ఆచరించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



కీసరగుట్టలో శివలింగానికి అభిషేకం

వైభవంగా అనంతగిరి పెద్దజాతర

వికారాబాద్ : కార్తీక మాస అనంతగిరి పెద్ద జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అనంతగిరికి చేరుకుని అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్నారు. పిల్లలు, పెద్దలు సందడిగా గడిపారు. అనంతగిరి ఆధ్యాత్మిక సేవా మండలి తరఫున నిత్యం భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆరుగంటల సమయంలో ధార్మిక ప్రవచనం ఆధ్యాత్మిక కళావేదిక ఆధ్వర్యంలో డాక్టర్ పి భాస్కరయోగి సనాతన ధర్మం గురించి వివరించారు. ఈనెల 25న చక్రస్నానంతో అనంతగిరి జాతర ఉత్సవాలు ముగియనున్నాయి.



లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కష్టాల్లో కార్యదర్శులు!

- నిధులు లేక పెరుగుతున్న ఒత్తిడి
- అప్పులు చేసి పనులు
- పెరిగిన పని భారం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉక్కిరిబిక్కిరి
- ఆదుకోవాలంటూ వేడుకోలు

7

కొత్తగూడెంలో పుష్ప-2

- మూసీనది సమీపంలో సినిమా షూటింగ్
- సన్నివేశాల చిత్రీకరణ
- తరలివచ్చిన సమీప ప్రజలు

7

సర్వే గడువు పొడిగిస్తారా?

- జంబో ప్రశ్నలతో ముందుకు సాగని సమగ్ర సర్వే
- నేడే చివరి తేదీ
- 50% దాటకపోవడంతో పొడిగించే ఛాన్స్!

7



ఏసుప్రభువు శిలువ వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

జాతరో జాతర..

మెథడిస్టు ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

ఏసు నామస్మరణతో మారుమోగిన ప్రాంగణం

- ప్రత్యేక ఆహ్వానితుడిగా సౌత్‌కొరియా క్రైస్తవ మత ప్రబోధకుడు ఇసాక్
- దైవసందేశం వినిపించిన బిషప్‌లు
- ఘనంగా ముగిసిన జాతర

ధారూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధారూరు క్రిస్టియన్ మెథడిస్టు జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. ధారూరు మండలంలోని స్టేషన్ ధారూరు-దోర్నాల్ గ్రామాల మధ్య ఉన్న జాతర ప్రాంగణంలో మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించిన జాతర ఉత్సవాల్లో వివిధ భక్తి కార్యక్రమాలు కొనసాగాయి. ముగింపు రోజు జాతర ప్రాంగణం ఏసుప్రభువు నామస్మరణతో మారుమ్రోగింది. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితుడిగా సౌత్ కొరియా క్రైస్తవ మత ప్రబోధకుడు ఇసాక్ పాల్గొని ప్రార్థనలు చేసి దైవసందేశం వినిపించారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది క్రైస్తవులు తరలివచ్చి ఏసు ప్రభువును దర్శించుకొని ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు రైళ్లు,

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న సౌత్‌కొరియా మతప్రబోధకుడు రెవరెంట్ ఇసాక్, వేదికపై బిషప్‌లు

విద్యార్థులకు శారీరక దృఢత్వం అవసరం

మేడ్చల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శారీరక దృఢత్వం అవసరమని జాతీయస్థాయి పూర్వ సైక్లిస్ అథ్లెటిక్ మర్రి లక్ష్మారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సన్‌ఫ్లవర్ వేదిక్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందితో కలిసి వాక్ థాన్ 5కే, సైక్లాథాన్ 10కే, శారీ థాన్ 5కే, రన్ 5కే నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి లక్ష్మారెడ్డి పాల్గొని విద్యార్థులతో కలిసి సైక్లింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సరిత కుమారి, ప్రిన్సిపాల్ కల్పన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


5కే రన్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కొడంగల్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు

కొడంగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సదర్ ఉత్సవాలను కొడంగల్‌లో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు వివిధ గ్రామాల నుంచి దున్నపోతులను తీసుకొచ్చి విన్యాసాలు చేయించారు. కొడంగల్ పట్టణంలోని గాడిబావి శివాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగిన దున్నపోతుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవ కులస్థుల సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. సదర్ ఉత్సవాలను చూసేందుకు కొడంగల్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నియోజకవర్గ నాయకులు మధుసూదన్‌యాదవ్, డాక్టర్ రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సదర్ ఉత్సవాల్లో యాదవ సంఘం నాయకులు

గోశాలలో 'మహా అన్నకూట్' మహోత్సవం


యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

శంషాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ - గగన్‌పహాడ్ లోని సత్యం శివం సుందరం గోశాలలో ఆదివారం మహా అన్నకూట్ మహోత్సవం ఘనంగా జరిగింది. 84 సంవత్సరాల వయస్సున్న ధరమ్‌రాజ్ రాంఖా ఇక్కడ ఆవులకు సేవ చేస్తున్నారు. 8 ఎకరాల స్థలంలో సత్యం శివం సుందరం గోశాలను స్థాపించారు. అన్ని కబేళాల నుంచి రక్షింపబడిన ఆవులు, ఎద్దులకు ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం 6,000లకుపైగా ఆవులకు ఆశ్రయం కల్పిస్తున్నాడు. ఇక్కడ ఉన్న ఆవులకు గడ్డి, దాణా వేసి పెంచుతారు. ఆవు పేడను రైతులకు జీవ ఎరువుగా చాలా సరసమైన ధరకు అందజేస్తారు. ఆవుల సంరక్షణకు 100 మంది కూలీలను నియమించారు. మొత్తం నెలకు రూ.70 లక్షల నిర్వహణ ఖర్చు వస్తుందని ధరమ్‌రాజ్ రాంఖా తెలిపారు. అన్నకూట్ పండుగను కొత్త ఆహారంగా గోశాలలో జరుపుకుంటామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పండిత్ హరిశ్చంద్రజీ కులకర్ణి, మహాలక్ష్మీ పంచకుండా మహాయజ్ఞం పూజ ఆశ్రయంలో నిర్వహించారు. హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాలకు చెందిన వేలాదిమంది జంతుప్రేమికులు ఈ ఉత్సవంలో పాల్గొని ఆవులకు గడ్డి, దాణా అందించి యజ్ఞ పూజలో పాల్గొన్నారు.

గండిమైసమ్మకు దండిగా మొక్కులు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) మైసిగండి మైసమ్మ బ్రహ్మోత్సవాలు కనుల పండవగా కొనసాగుతున్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు పచ్చటి తోరణాలు రంగురంగుల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచేకాక పొరుగు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన మైసమ్మ ఆలయానికి హిందువులతో పాటు ముస్లింలు కూడా హాజరవుతున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండ ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ పంతు, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు బంగారు ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు మైసమ్మ నామస్మరణతో మైసిగండి మారు మోగింది. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఉత్సవ నిర్వాహకుడు రమావత్ భాస్కర్, తహసీల్దారు ఆర్‌పీ జ్యోతి, మాజీ సర్పంచులు శేఖర్‌గౌడ్, తులసీరామ్‌నాయక్, అర్చకులు గ్రామ యువకులు తదితరులున్నారు.


గోడ పత్రికను విడుదల చేస్తున్న బేర బాలకిషన్, తదితరులు

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

కందుకూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ ఒకటో తేదీన నగరంలో నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బేర బాలకిషన్ కోరారు. ఆదివారం మాలల సంఘం మండల కన్వీనర్ గాదె కుమార్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి లక్షలాది మంది మాలల అహోరాత్రులు కష్టపడ్డా విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్సీలకు కావలసింది వర్గీకరణ కాదని దళితులు సమగ్ర అభివృద్ధి జరుగాలన్నారు. అందుకోసం 15శాతం ఉన్న ఎస్సీల రిజర్వేషన్‌ను 25శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనకు మాలలు 10లక్షలకు పైగా హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మహేశ్వరం నియోకవర్గం ఉద్యోగ నాయకులు యాలాల శ్రీశైలం, గాదె లక్ష్మయ్య, యాదయ్య, నరసింహ, యాలా ల శ్రీనివాస్, పాండు, శ్రీనివాస్, బాల్‌రాజ్, విష్ణు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రాజగంగారెడ్డి, కోశాధికారి తుకారంల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్.రామ్‌రెడ్డి(బౌరంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), ప్రధాన కార్యదర్శిగా టీ.మురళీ కృష్ణ మూర్తి(కొకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), కోశాధికారిగా భాగ్యమణి(కొల్తూరు)ను ఎన్నుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర కౌన్సిలర్లుగా డి.వేణు(శామీర్‌పేట), ఎం.వి.వి.రామకృష్ణ(బాచుపల్లి)ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సత్యం, కృష్ణ, గిరిధర్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


వామ్మో.. వానరాలు!

» ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు » ప్రజలపైకి ఎగబడుతూ దాడులు
» కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలు » బెంబేలెత్తిపోతున్న కందుకూరు మండల ప్రజలు


కందుకూరు వీధుల్లో తిరుగుతున్న కోతులు

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. మనుషులు కనబడితే చాలు మీద దునుకుతూ దాడి చేస్తున్నాయి. మనుషులు లేని సమయాల్లో ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను తీసుకెళ్లి రోడ్లపై పడేస్తున్నాయి. ఇళ్లలోకి వచ్చిన వానరాలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించిన ఐదు మంది కిందపడి కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలయ్యారు. మండల కేంద్రంతోపాటు కొత్తగూడ తదితర గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి.

నగరానికి అతి సమీపంలో ఉన్న కందుకూరు మండంలో రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగించే వారు. ఏదారేళ్లుగా ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందడంతో వ్యవసాయ భూములు ప్లాట్లుగా, ఫాంహౌస్‌లుగా మార్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెట్లను నరికేశారు. దీంతో వ్యవసాయ క్షేత్రాల్లో ఉండే వానర సైన్యం ఊళ్ల మీద పడుతోంది. అలాగే మండల కేంద్రంలోని పలు ఫంక్షన్ హాల్‌లలో సైతం కోతులు తిష్టం వేసి అక్కడి వస్తువులను చిందరవందరగా చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండల కేంద్రంలో వానరసైన్యం ఇళ్లల్లోకి వచ్చి దాడులు చేయడంతో ఇటీవల సొడపు సుజాత, బొక్క రాంచంద్రారెడ్డి, యాలాల శ్రీనివాస్‌రెడ్డి, ఇలా కందుకూరులో వానర సైన్యం ప్రజ



కోతుల బెడద ఎక్కువైంది



రోజురోజుకు కోతుల బెడద ఎక్కువైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. పిల్లలను దుకాణాలకు పంపిచాలంటే కూడా భయం వేస్తోంది. ఇంటి ఆవరణలో ఏమైనా ధాన్యం ఆరబోసుకోవాలంటే కూడా ఇబ్బందిగా మారింది. నేను ఇటీవల ఇంటిపై నుంచి కిందకు వస్తుండగా కోతులు ఒక్కసారిగి నాపై దాడి చేశాయి. ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి వెనుకకు పరుగెత్తడానికి ప్రయత్నించి కిందపడటంతో రెండు కాళ్లు విరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడదను అరికట్టాలి.

-సొడపు సుజాత, కొత్తగూడ

వీధుల్లో తిరగలేక పోతున్నాం



కందుకూరులో వీధుల్లో తిరగలేక పోతున్నాం. ఎప్పుడు కోతుల గుంపు దాడిచేస్తుందోనని భయంతో బతుకుతున్నాం. మూడేళ్లుగా కోతుల గుంపులు ఇబ్బంది పెడుతున్నాయి. ఇంత జరగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం వాటిని అడవుల్లోకి తరలించడానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. ఇళ్లలో ఉన్న మహిళలు మధ్యాహ్నం వేళల్లోనూ డోర్లు మూసుకొని ఉండాల్సి వస్తోంది. నేను ఉదయం వేళలో దేవాలయానికి వెళ్లగా అక్కడ కోతుల గుంపు నాపై దాడి చేసింది. ఆ ప్రమాదంలో నా ఎడమ కాలు విరిగింది. నాలాగే చాలా మందికి గాయాలై అవస్థలు పడుతున్నారు.

-యాలాల శ్రీనివాస్‌రెడ్డి, కందుకూరు

బీసీల స్థితిగతులపై

21న బహిరంగ విచారణ



రంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీల స్థితిగతులపై 21న కొంగర కలాన్‌లోని కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రంగారెడ్డి జిల్లా, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించి విచారణ ఉంటుందన్నారు. జిల్లాలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకోవాలని, బీసీలు పడుతున్న ఇబ్బందులు తొలగిపోవడానికి, బీసీల పరిస్థితి మెరుగుపర్చడానికి రాష్ట్ర సంక్షేమానికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని కమిషన్ భావిస్తుందన్నారు. 21న కలెక్టరేట్‌లో నిర్వహించే బహిరంగ విచారణలో బీసీ సంఘాలు, సంచార జాతులు, ఇతర కులాల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంచార జాతుల కుల పెద్దలతో పాటు ఇతర కులపెద్దలు, కమిషన్ ఇచ్చే నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లతో తెలుగు/ఇంగ్లీషు భాషలో బహిరంగ విచారణకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

ధారూరు మండలాన్ని అభివృద్ధిపరుస్తాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరా రెడ్డి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రఘువీరారెడ్డి

ధారూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లలో ధారూరు మండల అభివృద్ధికి కృషి చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి తెలిపారు. మండలంలోని ఎబ్బనూర్‌లో రూ.20లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. కెరెల్లి గ్రామంలో 15 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అశోక్ ముదిరాజ్, రాజేందర్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కుట్రలో భాగమే లగచర్ల ఘటన

» కేటీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలి » డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్


విలేకరులతో మాట్లాడుతున్న హన్మానాయక్, బిక్యానాయక్

కడ్తాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటన బీఆర్‌ఎస్ కుట్రలో భాగమేనని డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిక్యానాయక్, రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షులు హన్మానాయక్ అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని అస్థిర పరచి రాజకీయంగా లబ్ధిపొందేందుకు మాజీ మంత్రి కేటీఆర్ డైరెక్షన్‌లోనే అధికారులపై దాడులు జరిగాయని ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడి చేయించిన కేటీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొడంగల్ అభివృద్ధి జరుగుతుంటే జీర్ణించుకోలేని కేటీఆర్ విషం కక్కుతున్నారని వారు మండిపడ్డారు. కొడంగల్‌ను 2018లో కేటీఆర్ దత్తత తీసుకొని కృష్ణాజలాలతో కాళ్లు కడుగుతా అని జనాన్ని నమ్మించి అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా మోసం చేశారని మండిపడ్డారు. లగచర్ల గిరిజన రైతులందరూ అమాయకులని వాళ్లను రెచ్చగొట్టి అధికారులపై దాడులకు పాల్పడేలా చేసిన కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమస్యలపై ప్రజల తరపున పోరాడాల్సిన ప్రతిపక్షం అమాయక ప్రజలను అడ్డుపెట్టుకొని అలజడులు సృష్టించడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి చర్యలను ఆపకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సేవాదల్ మండల అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, నరేందర్, రమేశ్ నాయక్, నరేశ్ నాయక్, దేవ్లా, సేవ్యానాయక్, బలరాం, లక్పతినాయక్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ నేతల ద్వంద్వనీతి సరికాదు

యాచారం: లగచర్ల ఘటనను బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేయడం దారుణమని యాచారం మండల కాంగ్రెస్ నాయకులు దెంది రాంరెడ్డి, మస్కు నర్సింహులు మండిపడ్డారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు పేదల భూములు తీసుకున్నారని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ భూములు తీసుకోవడంతో అనేక మంది పేదలు నేడు ఉపాధి లేక అల్లాడుతున్నారని వారు ఆందోళన చెందారు.


నియామక పత్రాన్ని అందజేస్తున్న కేఎల్లార్

మహేశ్వరం ఏఎంసీ చైర్మన్‌గా కృష్ణానాయక్

కందుకూరు/మహేశ్వరం నవంబరు 17:(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ కందుకూరు మండలాన్ని వరించింది. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం పెద్దమ్మ తాండకు చెందిన ఎస్ కృష్ణానాయక్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన 2001లో పులిమామిడి ఎంపీటీసీగా బాధ్యతలు చేపట్టారు. 2006 నుండి 2011 వరకు కృష్ణానాయక్ భార్య ఎస్ గోభీకృష్ణానాయక్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2015లో జిల్లా పార్టీలో బాధ్యతలు చేపట్టిన ఆయన 2016 నుండి 2022 వరకు మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు ఇచ్చిన ప్రతి నాయకుడికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా డైరెక్టర్లను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, మల్లేష్, భూపాల్‌రెడ్డి, మహేందర్, రఘుపతి, కప్పాటి పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వే గడువు పొడిగిస్తారా?


జంబో ప్రశ్నలతో ముందుకు సాగని సమగ్ర సర్వే

షెడ్యూల్ ప్రకారం నేడే చివరి తేదీ

50 శాతం దాటకపోవడంతో పొడిగించే ఛాన్స్!


సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

తాండూరు, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే -2024 గడువు పొడిగించే అవకాశాలు ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం 18వ తేదీ (నేటి)తో క్షేత్ర స్థాయిలో సర్వే ముగియాల్సి ఉంది. 8 పేజీలు 75 రకాల ప్రశ్నాలతో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి అక్కడ వివరాలు సేకరించేందుకు 40 నిమిషాల నుంచి గంట సమయం పడుతోంది. రోజుకు ఎంత కష్టపడినా 10 నుంచి 12 ఫామ్స్ వరకు మాత్రమే నింపగలుగుతున్నారు. దీంతో ఈ నెల 9న ప్రారంభమైన నాటికి పూర్తి స్థాయిలో ఫారాలు రాకపోవడం, క్షేత్ర స్థాయిలో సర్వే ఎందుకు అనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించే వరకు మూడు రోజుల సమయం పట్టింది. ప్రస్తుతం ఆదివారం సాయంత్రం నాటికి తాండూరు డివిజన్‌లో 48శాతం మాత్రమే సర్వే పూర్తయింది. ఇంకా 52 శాతం వరకు సర్వే చేయాల్సి ఉంది. తాండూరు డివిజన్ పరిధిలో 9 మండలాలు, రెండు మున్సిపాలిటీలు కలిపి 1,22,862 ఇళ్లు ఉండగా 58,150 ఇళ్లలో మాత్రమే సర్వే పూర్తయింది. ఇంకా 64,712 ఇళ్ల సర్వే పూర్తి కావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.


మూసీనది సమీపంలో షూటింగ్ చేస్తున్న బృందం

కొత్తగూడెంలో పుష్ప-2 షూటింగ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్, కొత్తగూడెం మూసీనది సమీపంలో ఆదివారం పుష్ప-2 చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. మూసీనది వంతెన వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసే సన్నివేశంతో పాటు ఇతర సన్నివేశాలను చిత్రీకరించారు. చిన్న చిన్న ఆర్టిస్టులతోనే ఈ షూట్ పూర్తిచేశారు. కాగా, అల్లు అర్జున్ వస్తారనే ప్రచారంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో షూటింగ్ చూడడానికి తరలివచ్చారు.

కష్టాల్లో కార్యదర్శులు!


పెద్దేముల్ ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శులు(ఫైల్)

- నిధులు లేక పెరుగుతున్న ఒత్తిడి
- అప్పులు చేసి పంచాయతీ పనులు
- అన్ని శాఖల పనులతో పెరిగిన పనిభారం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆగమాగం
- ఆదుకోవాలంటూ వేడుకోలు

తాండూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫిబ్రరి 2న సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. తొమ్మిది నెలలు గడిచినా ఎన్నికలు జరుగలేదు. దీంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోగా, ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా ముందుగా గుర్తుకొచ్చేది పంచాయతీ కార్యదర్శులే. అటు నిధులు లేక ఇటు బాధ్యతలు పెరిగి కార్యదర్శుల కష్టాలకు మొదలయ్యాయి. మరోవైపు గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో ఊర్లో ఉన్న జనంతో పాటు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విధులు నిర్వహించేందుకు సతమతమవుతున్నారు. పంచాయతీలలో తీవ్ర నిధుల కొరత ఏర్పడడంతో రోజువారీ కార్యకలాపాలకు గాను పంచాయతీ కార్యదర్శులు వారి జీతం నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి. జనవరి నుంచి ఇప్పటి వరకు చేయించిన పనుల చెక్కులు క్లియర్‌కాక పోవడంతో ప్రస్తుతం పంచాయతీలకు అవసరమైన సామగ్రి ఇచ్చేందుకు ఎజెన్సీలు, దుకాణాదారులు ఉద్దెర ఇవ్వడానికి ముందుకు రాని దుస్థితి. అలాగే పంచాయతీ సిబ్బందికి నెలల తరబడి జీతాలు రాకపోడంతో ఎంతో కొంత తన జీతం నుంచి ఇచ్చి వారి సేవలను వినియోగించుకుంటున్నారు. అది కూడా వారిని బతిమిలాడుకోవాల్సి వస్తోంది. లేకపోతే పారిశుద్ధ్య, మంచి నీటి సరఫరా, విద్యుత్ దీపాల పనులు నిలిచి పోతాయనే భయం నెలకొంది. దీనికి తోడు ట్రాక్టర్ డీజిల్ కూడా సొంత డబ్బులతో పోయిస్తున్నారు.

ఆందోళన బాటలో సెక్రటరీలు

కార్యదర్శులు వచ్చే జీతంతో పాటు అప్పులు చేసి మరీ పల్లెల్లో పనులు నిర్వహించాల్సిన పరిస్థితి. స్టేట్ ఫైనాన్స్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు నిలుపుదల చేయడంతో పారిశుద్ధ్య, మురుగు కాల్వ పూడికతీత, నీటి సరఫరా మోటార్లు రిపేర్ ట్రాక్టర్ రిపేర్లు, వీధి దీపాల నిర్వహణ, గ్రామ సభల నిర్వహణ, ఇలా రకరకాల పనులు చేయిస్తున్నా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాండూరు డివిజన్‌లోని ఏడు మండలాలలోని కార్యదర్శులు ఎంపీడీఓలకు వినతిపత్రాలను సమర్పించారు.

పని భారం తగ్గించండి

కేవలం పంచాయతీరాజ్ శాఖ పనులే అప్పగించి పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి నియమించినప్పటికీ అన్ని శాఖల పనులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగు దొడ్లు, సర్వే, వ్యవసాయక శాఖకు సంబంధించిన సర్వేలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, వివాహాల రిజిస్ట్రేషన్లు తదితర పనులను పంచాయతీ కార్యదర్శే పర్యవేక్షించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శిపై ఎంపీఓలు, ఎంపీడీవోలు, డీఎల్‌పివో, డీపీవోలు పనులు చేయాలని వత్తిడి పెంచుతున్నారే తప్ప వారి సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పని చెబితే ఎలా చేయాలని ఆలోచించేలోపే నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మెమో, చార్జీ మెమోలు, సస్పెన్షన్లు ఎదుర్కోవాల్సి వస్తుందనిపంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా రైతు బజార్

- కారు పార్కింగ్‌గా మారుతున్న షెడ్లు
- ఫుట్‌పాత్‌లకే పరిమితమవుతున్న చిరువ్యాపారులు
- మేడ్చల్‌లో వ్యాపారులను ఒకేచోటుకు చేర్చడంలో పాలకులు విఫలం


మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన రైతు బజార్

మేడ్చల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిరు వ్యాపారస్తుల కోసం ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి మేడ్చల్ పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. రైతు బజార్ ఏర్పాటుకు ముందు స్థానికంగా ఫుట్‌పాత్‌లపై, తోపుడు బండ్లపై పండ్లు, పూలు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారస్తులు తమకు వ్యాపార సముదాయం ఏర్పాటుచేయాలని పాలకుల చుట్టూ తిరిగారు. అనేక తంటాలు పడి పాలకులు మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణ నడి బొడ్డున రైతు బజార్ ఏర్పాటు చేశారు. సకల సౌకర్యాలతో ఏర్పాటు చేసిన రైతుబజార్‌లో చిరు వ్యాపారులు మాత్రం తమ దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. 10 సంవత్సరాల కిందట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మేడ్చల్ పట్టణం ప్రధాన మార్కెట్ సమీపంలో ఉన్న పశుసంవర్థక శాఖకు చెందిన స్థలాన్ని మార్కెట్ కమిటీ వారు తమ ఆధీనంలో తీసుకున్నారు. స్థానికంగా రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై, తోపుడు వండ్లపై కూరగాయాలు, పండ్లు, పూలు విక్రయించే వ్యాపారస్తుల కోసం రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ దాదాపు 80దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా షెడ్లను ఏర్పాటు చేశారు. అయితే మటన్ విక్రయించే వ్యాపారులు కొన్ని షెడ్లలో తమ దుకాణాలు ప్రారంభించారు. మిగితా షెడ్లలో మాత్రం వినియోగించుకునేందుకు ఇతర వ్యాపారస్తులు ముందుకు రావడంలేదు. దీంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. వందల సంఖ్యలో చిరు వ్యాపారస్తులు పట్టణంలోని రోడ్ల ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టుకుని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసుకుంటున్నారు. అయినప్పటికీ మార్కెట్ కమిటీ వారు ఏర్పాటుచేసిన రైతుబజార్ షెడ్లను వినియోగించుకోవడానికి ముందుకు రావడం లేదు. చిరు వ్యాపారులందరినీ ఒక్క చోటుకు తీసుకురావడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ, స్థానిక మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయం లోపించటంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయన్న ఆరోపణలు వినబడుతున్నాయి.


మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న షెడ్లు

ఫుట్‌పాత్‌లు వీడని వ్యాపారస్తులు

మేడ్చల్ పట్టణంలోని వివేకానంద్ చౌరస్తా నుంచి మహవీర్ చౌరస్తా వరకు ఉన్న పాత జాతీయరహదారి ఇరువైపులా చిరువ్యాపారస్తులు వందల సంఖ్యలో దుకాణాలు పెట్టుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ వ్యాపారస్తులను రైతుబజార్ షెడ్లకు తరలించడానికి స్థానిక మార్కెట్ కమిటీ, మున్సిపల్ అధికారులు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ వారు ఫుట్‌పాత్‌లు వదిలి రావడానికి సిద్ధంగా లేరని అధికారులు అంటున్నారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారస్తులను రైతుబజార్‌కు తరలించాలని స్థానికకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండటంలేదు. ఫలితంగా ప్రధాన మార్కెట్‌లో నిత్యం ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే వారితో ద్విచక్ర వాహనాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.


రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు

కార్ పార్కింగ్‌గా మారిన రైతు బజార్ షెడ్లు

రైతుబజార్‌లో ఖాళీగా ఉన్నషెడ్లను స్థానికులు కొందరు కార్‌పార్కింగ్ షెడ్లుగా మార్చేశారు. కాలనీలో పార్కింగ్‌కు సరైన స్థలం లేక ఇక్కడ పార్కింగ్ చేస్తున్నామని వారంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ వారు పట్టించుకోక పోవటం గమనార్హం. దీంతో రోజురోజుకు కార్లు పార్కింగ్ చేసే వారి సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు రైతుబజార్ గురించి పట్టించుకునే వారు లేక ఇక్కడ రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.


మార్కెట్‌యార్డులో పార్కింగ్ చేసిన కార్లు

క్రైం కార్నర్

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

వికారాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ శివసాగర్ చెరువులో స్కూటీతో సహా పడిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని వికారాబాద్ పోలీసులు తెలిపారు. వికారాబాద్ సీఐ భీమ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16వ తేదీన శివసాగర్ చెరువులో ఓ గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికులు తెలపడంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. స్కూటీ నెంబర్ ఆధారం గా వివరాలు సేకరించారు. మృతుడు మల్కాజిగిరిలోని చక్రిపురం క్రాస్రాకు చెందిన నరసింహ మహంతి కుమారుడు విక్రమ్ మహంతి(24)గా గుర్తించారు. విక్రమ్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందిపడేవాడని, ఈ క్రమంలో మనోవేదనకు గురై ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వికారాబాద్‌కు స్కూటీపై బయల్దేరాడని తెలిపారు. ప్రమాదవశాత్తు స్కూటీ అదుపు తప్పి స్కూటీతో సహా చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులు వివరించారు.

మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి

బొంరాస్‌పేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చెరువులో పడి ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూర్ గ్రామానికి చెందిన మంగలి నర్సింహులు(35) కొంత కాలంగా తన భార్యా పిల్లలతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అద్దెకు ఇంటిని తీసుకొని సెలూన్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన నర్సింహులు ఇటీవల హైదరాబాద్‌లో పనిచేయకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి 15 రోజుల క్రితం వచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై శనివారం సాయంత్రం కొత్తూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువు దగ్గరికి వెళ్లి చెరువులో పడ్డాడు. ఈత రాకపోవడంతో నర్సింహులు చెరువులో మునిగి మృతి చెందాడు. నర్సింహులు కుటుంబీకులు భార్య రజితకు సమాచారం అందించడంతో ఆదివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడు..

వికారాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆకలికి తాళలేక ఓ గుర్తుతెలియని యాచకుడు మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ భీమ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దుర్గా భవానీ హోటల్ ఎదుట ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండడంతో హోటల్ యాజమాని హోటల్ తెరిచేందుకు వెళ్లి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూడగా మృతుడు రైల్వేస్టేషన్ ఆవరణలో బిక్షాటన చేస్తూ అక్కడే పండుకునే వాడిగా గుర్తించారు. అతడికి ఆహారం సరిగ్గా లేక ఆకలితో మృతిచెంది ఉంటాడని, ఇతడి ఒంటిపై గ్రీన్ కలర్ షర్ట్, దానిపై చలికోటు, దానిపై రెడ్ చలి కోటు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 8712670030 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కలప తరలిస్తున్న లారీ పట్టివేత

బషీరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లారీలో అక్రమంగా కలపను తరలిస్తుండగా పట్టుకున్నట్లు బషీరాబాద్ పోలీసులు తెలిపారు. మండలంలోని జీవన్గి గ్రామ శివారు లోంచి అక్రమంగా లారీలో కలపను తరలిస్తున్నట్లు ఓ వ్యక్తి స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని లారీ డ్రైవర్‌ను విచారించగా మంచిర్యాల్ జిల్లా బెల్లంపల్లి మండలం బుధగుట్ట గ్రామానికి చెందినవాడిగా చెప్పుకొచ్చాడు. కలపకు సంబంధించి పోలీసులు డ్రైవర్‌ను అనుమతిపత్రాలు అడుగగా చూపించకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తాండూరులోని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఏఎస్ఐ నారాయణ తెలిపారు.


బషీరాబాద్ పోలీసులు పట్టుకున్న కలప లారీ

పీఎంసీకే సర్వే కన్‌స్ట్రక్షన్ పనులు భేష్


ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఎంసీకే సర్వే కన్‌స్ట్రక్షన్ పనులు భేష్ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని వట్టిమీనపల్లిలో ఆదివారం పీఎంకే వారు నిర్వహిస్తున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోలీస్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, బుచ్చయ్య, నర్సింహులు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఫ్రెషర్స్ డే


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నటి అస్మిత నాగరాజ్, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 2024సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో చదువుతూ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థిని, నటి అస్మిత నాగరాజు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఏడుకొండలు, కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు


డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టినట్లు పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మునిసిపల్ పరిధిలోని ఐదవ వార్డులో ఆదివారం అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దశరథం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాండూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ కాంగ్రెస్ నాయకుడు నర్సింహులు మాతృమూర్తి రెండు రోజుల కిందట మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, తాండూరు మార్కెట్ కమిటీచైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, శ్రీశైలం, మల్లేశం పాల్గొన్నారు.

పెద్దేముల్: పెద్దేముల్ మండలం మారెపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు బల్వంత్‌రెడ్డి తల్లి పట్లోళ్ళ పద్మమ్మ శనివారం సాయంత్రం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు ఆదివారం మారెపల్లి గ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరివెంట టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కోట్‌పల్లి ఏఎంసీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, కరణం పురుషోత్తంరావు, గాజీపూర్ నారాయణరెడ్డి, రుద్రారం మహిపాల్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం పాల్గొన్నారు.

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని ఇంద్రానగర్‌లో కుమ్మరి కిష్టయ్య, బాలాజీనగర్‌లో తలారి బుగ్గమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. నిరుపేద కుటుంబాలు కావడంతో అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తలారి శేఖర్, మోహన్, ఓంప్రకాశ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శామీర్‌పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట సెక్షన్ పరిధిలో సోమవారం(నేడు) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటు శామీర్‌పేట సెక్షన్ విద్యుత్ ఏఈ రాఘవేందర్ తెలిపారు. విద్యుత్ లైన్ల కింద పెరిగిన చెట్ల నరికివేత, విద్యుత్ లైన్ల మరమ్మత్తులను చేపట్టనున్నట్లు నేపథ్యంలో శామీర్‌పేట, దేవరయాంజాల్, తూంకుంట ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

తొలిరోజు ప్రశాంతం

(5వ పేజీ తరువాయి)

సమయం మించిపోవడంతో పరుగెత్తుకుంటూ వచ్చినా అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించలేదు. రెండు, మూడేళ్ల నుంచి సిద్ధమయ్యాయని, బస్సు కారణంగా రెండు నిమిషాలు ఆలస్యమైందని, తనను లోపలికి అనుమతించాలని హైదరాబాద్ నుంచి వచ్చిన ఓయువతి అధికారులను వేడుకున్నా అనుమతించకపోవడంతో కన్నీటిపర్యంతమైంది. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌కు ఫొటో అతికించాలని, హాల్ టికెట్‌తో పాటు ఓ గుర్తింపు పత్రం తీసుకురావాలని టీజీపీఎస్సీ అధికారులు స్పష్టం చేసినా కొందరు అభ్యర్థులు ఫొటో అతికించకుండా, గుర్తింపు కార్డు లేకుండానే కేంద్రాలకు రావడం గమనార్హం. చివరి నిమిషంలో హడావిడి పడినా ఫలితం లేకుండాపోయింది. నిబంధనలపై అవగాహన లేక పరీక్షరాసే అవకాశం కోల్పోవడం గమనార్హం. కాగా, పరీక్ష కేంద్రాల వద్ద బ్యాగులు, సెల్‌ఫోన్లు డిపాజిట్ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కేంద్రం మెయిన్ గేట్ వద్ద వదిలేసి అభ్యర్థులు పరీక్ష రాసేందుకు లోపలికి వెళ్లారు. పరిగిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 12 మంది అభ్యర్థులు అలస్యంగా రావడంతో పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు.

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

ఇదిలా ఉంటే, జిల్లాలో గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీధర్, టీజీపీఎస్సీ పరిశీలకులు డాక్టర్ శ్రీధర్ సందర్శించారు. శ్రీఅనంతపద్మనాభ ఆర్ట్స్ సైన్స్ అండ్ కామర్స్ కళాశాల, సిద్ధార్థ బాలికల జూనియర్ కళాశాల కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష కొనసాగుతున్నతీరు, కల్పించిన సౌకర్యాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించే ప్రక్రియ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు. తాండూరులో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఎస్పీ పరిశీలించారు.

ఎన్ఎస్ఆర్ కాలేజీలో గందరగోళం

గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 65,361 మంది అభ్యర్థులకు గాను కేవలం 30 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియలు జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. మేడ్చల్‌లోని ఎన్ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు మొదట ఎంచుకున్న ప్రకారమే ఇన్విజిలేటర్లు పేపర్లు అందించగా తాము ఎడిట్ ఆప్షన్‌లో పెట్టుకున్న విధంగా పేపర్లు ఇవ్వాలని తెలపడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. జేఎన్టీయూ అధికారులతో మాట్లాడి అభ్యర్థుల మేరకు పరీక్షా పేపరు ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.


ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఘట్‌కేసర్ బైపాస్ వద్ద ట్రాఫిక్ జామ్

ఘట్‌కేసర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని బైపాస్‌రోడ్డులో ఆదివారం రాత్రి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరవాసులు యాదగిరిగుట్ట, స్వర్ణగిరితోపాటు వివిధ పనులపై వరంగల్ వైపునకు వెళ్లి తిరిగి వస్తున్న తరుణంలో ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. దాదాపు మూడు గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించడానికి ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించారు. వరంగల్ నుంచి నగరం వైపుకు వెళ్లాల్సిన వాహనాలు ఎన్ఎఫ్ సీనగర్ సమీపంలోని హెచ్‌పీసీఎల్ వరకు, నగరం నుంచి వరంగల్ వైపునకు వెళ్లాల్సిన వాహనాలు అన్నోజిగూడ వరకు నిలిచిపోయాయి. ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపునకు వెళ్లాల్సిన వాహనదారులు నాలుగు వైపులా గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ప్రధానరోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోవడంతో సర్వీసు రోడ్లపై వచ్చిన వాహనదారులు చౌరస్తా వద్ద నిలిచిపోయారు.


వరంగల్ వైపునకు వెళ్తూ నిలిచిన వాహనాలు

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి సహకరించాలి

ఘట్‌కేసర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):కాలనీల్లో సమస్యల పరిష్కారానికి యువత తమ వంతు సహకారం అందించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. చౌదరిగూడలోని వివిధ కాలనీల్లో ఆయన ఆదివారం మార్నింగ్ వాక్ నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే మున్సిపల్ సిబ్బందితో పాటు ఎక్స్‌కవేటర్ సాయంతో పలు కాలనీల్లో రోడ్లపైకి వచ్చిన చెట్లకొమ్మలను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సాయితేజ, నాయకులు శ్రీనివాస్, రవీందర్, పవన్‌రెడ్డి, రవి, అశోక్ పాల్గొన్నారు.


చౌదరిగూడలోని డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

కొడంగల్ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాయిపల్లిలోని పాఠశాలలో 12 సంవత్సరాల పాటుగా విధులు నిర్వహించి బదిలీపై కొడంగల్ వెళ్లిన ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని గ్రామస్థులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య మాట్లాడుతూ లక్ష్మీనారాయణ నిబద్ధతో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను గురుకుల పాఠశాలల్లో చేరేలా కృషిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వసీం, రేషన్ డీలర్ కాశప్ప, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

జాతరో జాతర..

(5వ పేజీ తరువాయి)

బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో పాదయాత్ర ద్వారా జాతరకు తరలివచ్చారు. ముగింపు ఉత్సవంలో జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ప్రత్యేక ఆహ్వానితుడిగా సౌత్ కొరియా మత ప్రభోదకుడు ఇసాక్

ముగింపు ఉత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితుడిగా సౌత్ కొరియాకు చెందిన మత ప్రభోదకుడు ఇసాక్, ముఖ్య అతిథులుగా బిషప్‌లు ఎన్.ఎల్. కర్‌కరే, ఎం.ఏ. డేనియల్ దంపతులు పాల్గొని ప్రధాన వేదిక వద్ద ఉన్న ఏసు ప్రభువు శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేదికపై ఆసీనులైన బిషప్‌లకు జాతర నిర్వాహకులు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. అనంతరం మతప్రబోధకుడు ఇసాక్ బిషప్‌ల భక్తులను ఉద్దేశించి ప్రసిగించారు. దైవ సందేశాలను వినిపించి ఆశీర్వచనాలు అందజేశారు.

జాతరకు పోటెత్తిన క్రైస్తవ భక్తులు

ముగింపు రోజు జాతర ప్రాంగణంలో క్రైస్తవులు పోటెత్తారు. ప్రధాన వేదిక, ముఖద్వారం వద్ద ఉన్న ఏసు ప్రభువు శిలువల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. శిలువల వద్ద కొవ్వొత్తులు వెలిగించి మనసులో ఏసు ప్రభువు నామసస్మరణ చేస్తూ భక్తులు ప్రార్థనలు నిర్వహించారు. ప్రధాన శిలువ వద్ద ఉన్న ఇప్ప చెట్టు చెక్కను గీకి భక్తులు తమతో తీసుకెళ్లారు. కోరిన కోరికలు తీరిన భక్తులు కానుకలు సమర్పించారు. వీటిని నిర్వాహకులు అక్కడే వేలం వేశారు. భజన మండలి, ఆర్కెస్ట్రా బృందం భక్తి పాటలతో పరవశించిపోయారు. కాగా సాయంత్రం నుంచి భక్తులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు తిరుగు ప్రయాణమయ్యారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో జాతర కమిటీ కార్యదర్శులు స్టీవెన్, రవికుమార్ సెబాస్టియన్, వివిధ ప్రాంతాల కాన్ఫరెన్స్‌ల లేలీడర్లు, పాస్టర్లు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

కులకచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధితో ఎదగాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి టి.ఉమా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో ఆదివారం బండమీదితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విష్ణునాయక్ ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, సత్యహరిశ్చంద్ర, అంజిలయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల వద్ద రావి, వేపచెట్లను నాటాలి

పరిగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలయాల వద్ద రావి, వేపచెట్లను నాటాలని పురోహితులు సిద్ధాంతి పార్థసారథి అన్నారు. మునిసిపల్ పరిధిలోని బహాదూర్‌పేట్ హనుమాన్ ఆలయం, మైసమ్మ ఆలయాల ప్రాంగణాల్లో ఆదివారం రావి, వేపచెట్లను నాటారు. అనంతరం గుమ్మడికాయలతో పూజలు చేశారు. దైవ దర్శనం అనంతరం రావి, వేప అనంతరం ఈ చెట్ల చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకుంటే అనుకున్నవి నేరవేరుతాయని నమ్ముతారని తెలిపారు. కార్యక్రమంలో మునిపసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పట్టణ పెద్దలు కె.రఘుమోహన్‌రెడ్డి,జి.మాణిక్‌రెడ్డి, వేముల సత్యం, ధీరుబాబు, పి.చిన్ననర్సింహులు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయం వద్ద రావిచెట్టు నాటుతున్న సిద్ధాంతి పార్థసారథి

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం!

(5వ పేజీ తరువాయి)

లేదని వాపోతున్నారు. రైతులు, ధాన్యం వివరాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవడంతోనూ జాప్యానికి కారణం అవుతుందని స్వయంగా నిర్వాహకులే చెబుతున్నారు. అలాగే గన్నీబ్యాగుల కొరత ఉందని రైతులు వాపోతున్నారు. దీంతో అధికారుల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు నిల్..

జిల్లాలో 126 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులే చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎక్కడా కూడా కొనుగోళ్లు జరగడం లేదు. కొనుగోళ్లు అటుంచితే కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడం లేదు. ధాన్యం బస్తాలు నిల్వ చేసేందుకు వీలుగా గోదాములు ఉండాలి. అయితే జిల్లాలో ఎక్కడా కూడా ఈ వసతి లేదు. కొనుగోలు కేంద్రాల్లో తూకం మిషన్‌లు, టార్పాలిన్స్, గన్నీబ్యాగులు, తేమ మీటర్స్, ప్యాడీ క్లీనర్స్, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాల కల్పించాల్సి ఉంటుంది. కేంద్రాల్లో ఇప్పటి వరకు ఐరిష్ కిట్లు లేవు. ఓపీఎస్ సాఫ్ట్‌వేర్ కూడా ఇవ్వలేదు. వాస్తవానికి జిల్లాలో 29 లక్షల గన్నీ బ్యాగులు ఉండాలి. అందులో సగం అంటే.. 15 లక్షల గన్నీ బ్యాగులే అందుబాటులో ఉన్నాయి. కాగా, కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం కాకపోడంతో రైతులు బహిరంగ మార్కెట్లోకి తీసుకెళుతున్నారు. అక్కడ వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వింటాల్‌కు రూ.200లు తగ్గించి కొనుగోళ్లు చేస్తున్నారు. రూ.2,100ల నుంచి రూ.2,200ల లోపే కొంటున్నారు. చేసేది ఏమి లేక రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నామని వాపోతున్నారు.


గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదు



కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు కానీ, ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. ధాన్యం నూర్పిడి చేసి అమ్ముకునేందుకు సిద్ధంగా ఉంది. కాగా, వడ్లు నింపేందుకు గన్నీబ్యాగులు కూడా ఇవ్వడం లేదు. కేంద్రాల్లో ఏర్పాట్లు కూడా సరిగా లేవు.

-పాండునాయక్,సువాలితండా, పరిగి మండలం

పూడూరులో భగవద్గీత ప్రచారం


భగవద్గీత ప్రచారం చేస్తున్న ప్రభోద సేవాసమితి సభ్యులు

మేడ్చల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూరులో భగవద్గీత, అనుబంధ గ్రంథాల పట్ల ప్రచారం నిర్వహించారు. కర్తీక మాస వేడుకలను పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీసులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రభోద సేవ సమితి నిర్వాహకులు తెలిపారు.